క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రాధిక

అరకులోయ రూరల్: మండలంలో కొత్తభల్లుగుడ పంచాయతీ నియలిగుడ నుంచి గత్తరగుడ వరకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ కొర్రా రాధిక మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రధాన సమస్యలు గురిస్తున్నామని, వాటి పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. విడతల వారీగా అన్ని గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీరోడ్లు నిర్మిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, ఇంజినీర్ అసిస్టెంట్ ఆనంద్, నాయకులు రమేష్, సింహాద్రి, మోహన్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జాంకరమ్మ తల్లి ఉత్సవం


సింగర్భ గ్రామంలో జాంకరమ్మ ఆలయం వద్ద భక్తులు

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ కేంద్రంలో జాంకరమ్మ తల్లి పండుగ మంగళవారం ఈ ప్రాంత గిరిజన ప్రజలు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో కొలువై ఉన్న జాంకరమ్మ తల్లి వద్ద డప్పు వాయిద్యాల నడుమ గిరిజన మహిళలు థింసా నృత్యాలతో ఊరేగింపుగా వచ్చారు. గిరిజన ప్రాంత ప్రజలందరు పాడి పంటలతో సుఖశాంతులతో ఉండాలని ఆలయంలో గిరిజన పూజారులు కుమ్మరి పెద్దబ్బాయి, వండ్లాష్ గణేష్‌నాయుడు, నీలకంఠంనాయుడు పూజలు నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో జరిగే వివిధ మౌలిక సౌకర్యాలు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతు అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో గతంలో గుర్తించిన అభివృద్ధి పనులను అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతో సక్రమంగా చేయలేదన్నారు. పనులు సకాలంలో పూర్తి కాకపోతే సంబంధిత శాఖాధికారులు బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు బోర్లు, కుళాయి పనులు పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం


భయ్యనపల్లి అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడి నిర్వహించిన ఎస్‌ఐ భూషణం

గంగవరం : మండలంలోని నాటుసారా నిర్మూలనకు తగిన కృషి చేస్తున్నామని గ్రామాల్లో సారా విక్రయించినా, తయారు చేసినా తగిన సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ డి. భూషణం అన్నారు. మండలంలోని భయ్యనపల్లి రిజర్వు ఫారెస్టులో మంగళవారం సారా బట్టీపై ఎస్‌ఐ భూషణం సిబ్బందితో దాడి నిర్వహించి 700లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, ఐదులీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భూషణం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని సారా బట్టీల నిర్వహణ, విక్రయాలు అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నాటుసారా పై నిఘా పెట్టామన్నారు. గ్రామాల్లో మహిళలను, యువత సారాపై సమాచారం ఇవ్వాలన్నారు.

సమస్యలతో సతమతం

- అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- దుకాణదారుల అవస్థలు


దుంబ్రిగుడలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న హైవే రోడ్డు 516ఈ విస్తరణలో భాగంగా గుంటసీమ వెళ్లే రహదారిలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్మించిన ఈహైవే రహదారి పనుల్లో భాగంగా రోడ్డుకు మీటరున్నర ఎత్తుకు ఉన్నా డ్రైనేజీ కాలువలను నిర్మించారు. అయితే పైన వైపు ఉన్న దుకాణాలతో పాటు గృహాల్లో చిన్నపాటి వర్షం పడినా వర్షపు నీరుతో పాటు బురద నీరు చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురదనీటి, పురుగులు, చెత్తతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. హైవే రోడ్డు నుంచి దారి మళ్లించేందుకు నిర్మించిన డ్రైనేజీలో గుంటసీమ రోడ్డు నుంచి కలిపి డ్రైనేజీ అనుసంధానం చేయాలని కోరుతున్నారు. దుకాణాలన్ని చిన్నపాటి వర్షానికి మునిగిపోతున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి ఈ రోడ్డులో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై హైవే ఆథారిటీ అధికారులు పట్టించుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని దుకాణదారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హైవే రోడ్డులో డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు. ఈ ప్రాంతం లోతట్టులో ఉండడంతో వర్షపునీరు, వరదనీరు చేరి ఇబ్బందులు పడుతున్నారని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

హైవే అధికారులు స్పందించాలి



వర్షపు కురిసినపుడు మా దుకాణాలు నీటిలో మునిగిపోతున్నాయి. హైవే అధికారులు స్పందించి మా దుకాణాల్లో నీరు చేరకుండ చర్యలు తీసుకోవాలి. డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి. డ్రైనేజీ పూర్తిగా పాడైపోవడంతో వరదనీరు చేరుతుంది.

– ఎస్.సూర్యకుమార్(రాజు), దుకాణ యజమాని, మెయిన్‌రోడ్, దుంబ్రిగుడ

ముంచెత్తుతున్న వరదనీరు



హైవే నిర్మాణంలో భాగంగా తీసిన గోతుల్లో సరిగ్గా పూడ్చలేదు. డ్రైనేజీలు లేకపోవడంతో వర్షం కురిసినపుడు వర్షపునీటితో పాటు మట్టి దుకాణాల్లో చొచ్చుకొని వస్తుంది. దుకాణాల్లో సామగ్రి పాడవుతుంది. ఈ ప్రాంతం లోతట్టుగా ఉండడంతో వర్షాలు కురిసినపుడు ఇబ్బందులు తప్పడం లేదు. హైవే అధికారులు సక్రమంగా పనులు చేసి, సమస్యను పరిష్కారించాలి.

– గాని, దుకాణ యజమాని, దుంబ్రిగుడ

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, చిత్రంలో సర్పంచ్ పూర్ణిమ తదితరులు

హుకుంపేట: మండలంలోని సతకంపట్టు వద్ద పంచాయతీ నిధులు రూ.2లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమా, వార్డు సభ్యులు నూకరాజు, భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దీక్ష వస్త్రాల అందజేత


దీక్ష వస్త్రాలను అందజేస్తున్న అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్, పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు వెంకటరామయ్య

అడ్డతీగల: సత్య దీక్ష భక్తులకు అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం తరఫున దీక్ష వస్త్రాలను ఉచితంగా అందజేస్తున్నట్టు దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ చెప్పారు. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో దీక్షాధారులకు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతగా పురుషుల దీక్ష వస్త్రాలను అందజేశామని, త్వరలో స్త్రీలకు అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సత్య దీక్షలు చేపట్టే వారు పవనగిరి క్షేత్రానికి వచ్చి ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలు అందజేసి, రెండు జతల దీక్షవస్త్రాలు, మాల, పూజా పుస్తకం, పాకెట్ సైజ్ ఫోటో ఇస్తామని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈనెల 27 నుంచి దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా కొంతమంది భక్తులకు దీక్ష వస్త్రాలను అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో కలిసి తణుకు వెంకటరామయ్య పంపిణీ చేశారు. దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

దుంబ్రిగుడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి నీలిమ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు పట్ల బాలురు ఏ విధంగా ప్రవర్తించాలనే విషయాలను వివరించారు. దీంతో పాటుబాలిక చట్టాలు, మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు ఉన్నత విద్య అభ్యసించాలని, అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.స్వామినాయుడు, అధ్యాపకులు వై.బి.వి.ఎస్.చంద్రశేఖర్, అప్పలనాయుడు, కమల్, రమేష్, స్త్రీ శిశు సంక్షేమ సిబ్బందితో పాటు పోతంగి సచివాలయం మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తరలింపు


రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: మండలంలోని బట్టపనుకుల పంచాయతీ తీగలమెట్ట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీగలమెట్టలోని అంగన్‌వాడీ కేంద్రం భవనం పాడవడంతో సర్పంచ్ బాలకృష్ణ, గ్రామస్తుల తీర్మానంతో గ్రామంలోని వేరే చోటకు తరలించినట్టు చెప్పారు. వర్షాలు కురవడంతో అంగన్‌వాడీ భవనం పాడైందని, ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందిన గ్రామస్తులు, సర్పంచ్ బాలకృష్ణ తదితరులు సెంటర్‌ను వేరే చోటుకు తరలించాలని తక్షణమే తీర్మానం చేయడంతో చర్యలు తీసుకున్నామన్నారు.

ఆదర్శ రైతులకు ప్రోత్సాహక నిధులు


రైతులకు నిధులు అందజేస్తున్న సర్పంచ్ శాంతి, ఎంపీటీసీ రామరావు, ఏవో నీలవేణి

దుంబ్రిగుడ: లైగండ గ్రామ పంచాయతీ పరిధి గ్రామల మహిళా రైతులతో సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఆదర్శవంతమైన (ప్రకృతి) వ్యవసాయంపై చేస్తున్న నలుగురిని గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్టు వ్యవసాయ అధికారి నీలవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మాట్లాడుతూ అదివాసీ ప్రాంతాల్లో గిరిజనుల తింటున్న తిండిని ఉత్పత్తి చేసేందుకు ఎక్కువగా మహిళలే కష్ట పడుతున్నారని వేకువజామున పొలంలో వెళ్లి గంటల తరబడి పనిచేసి తిండిగింజలు అందించేందుకు శ్రమిస్తున్నారన్నారు. మహిళలకు ప్రోత్సాహ బహుమతులను సర్పంచ్ టి.శాంతి, ఎంపీటీసీ సభ్యుడు రామరావు అందజేశారు. మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పనులకు శంకుస్థాపన


కుండాడలో గోకులం షెడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి


చెక్కలమద్దిలో గ్రామస్తులకు సూచనలిస్తున్న సర్పంచ్ రాజు


జగ్గవరంలో కోళ్లషెడ్‌కు భూమిపూజ నిర్వహిస్తున్న సర్పంచ్ కారం పార్వతి

మారేడుమిల్లి: మండలంలోని కుండాడ, జీఎం వలస గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణానికి సర్పంచ్‌లు కుండ్ల ప్రభాకర్ రెడ్డి, కారం లక్ష్మి తదితరులు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఏపీవో రెడ్డి బాబు, మారేడుమిల్లి సర్పంచ్ కొండ జాకబ్, వైస్ సర్పంచ్ బి.రామరావు, నాయకులు శేషు కుమార్, రాజ్ కుమార్ రెడ్డి, మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని జగ్గవరం పంచాయతీ, కాచవరం పంచాయతీల్లో కోళ్ల షెడ్ల, పశువుల షెడ్ల నిర్మాణానికి సర్పంచ్‌లు కారం పార్వతి, సూదిపాక సాయి రమణమ్మ, పోచవరం పంచాయతీ కేంద్రంలో పశువుల షెడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ శీలం నాగేశ్వరరావు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోళ్ల షెడ్, పశువుల షెడ్, చెరువు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవో కె.ఆర్.విజయ, ఏపీఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జి.కె.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలో చెక్కలమద్ది గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న కందకాల పనులను సర్పంచ్ నడిగొట్ల రాజు మంగళవారం ప్రారంభించారు. ఉపాధి జాబ్‌కార్డుదారులు పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ రామ్మూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ లింగరాజు, గోవిందు, ఎంపీటీసీ సభ్యుడు రామన్న, కార్యదర్శి రాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు మహాలక్ష్మి, మోహన్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బురదలో బస్సులు... ప్రయాణికుల పాట్లు


రాజవొమ్మంగి శివారులో బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సులు

రాజవొమ్మంగి: మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి రాజవొమ్మంగి శివారులో నిర్మాణదశలో ఉన్న స్థానిక జాతీయ రహదారి చిత్తడిగా మారింది. దీంతో మంగళవారం ఉదయం నర్సీపట్నం నుంచి రాజవొమ్మంగి మీదుగా ఏలేశ్వరం, ఏలేశ్వరం నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్టీసీ బస్‌లు ఈ ప్రాంతంలోని బురదలో ఇరుక్కుపోయాయి. గంటల తరబడి నిలిచిపోయాయి. దీంతో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. హైవే నిర్మాణ సంస్థ సిబ్బంది బురదలో కూరుకుపోయిన బస్సులను బయటకు తీసి రాకపోకలను పునరుద్ధరించారు.

మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి


ఎంపీడీవో ప్రేమ్‌సాగర్


అరకులోయలోని శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ మహేష్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీడీవో లవరాజు ఆధ్వర్యంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పంచాయతీ పరిపాలన విధి విధానాలను వివరించినట్టు చెప్పారు. గ్రామాల్లో ప్రజా అవసరాల పనుల గుర్తించి తదితర విషయాలను శిక్షణ కార్యక్రమంలో తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ట్రైనర్‌గా వ్యవహరించిన మహేష్ పలు అంశాలను వివరించినట్టు తెలిపారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో మౌలిక సౌకర్యాలపై పంచాయతీ ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రేమ్ సాగర్ తెలిపారు. ఈనెల 17, 18 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో రెండు రోజులపాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వీధి దీపాల నిర్వాహణతో పాటు సంబంధిత బిల్లుల ప్రక్రియకు భాగస్వాములై ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా పంచాయతీ పాలకవర్గ సభ్యుల కృషి చేయాల్సి ఉండడంపై శిక్షణ ఇస్తున్నామని, పాలకవర్గ వార్డు సభ్యులతో పాటు ఉప సర్పంచ్‌లు శిక్షణలో పాల్గొవాలని ఆయన కోరారు.

కొయ్యూరు: ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 17, 18న రెండు రోజుల పాటు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మేరీరోజ్ మంగళవారం తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. హాజరైన వారికి టీఏ, డీఏలు ఉంటాయన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు

అరకులోయ రూరల్: అరకులోయలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు అరకులోయ సీఐ హిమగిరి తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్ కావడంతో అరకులోయతో పరిసర ప్రాంతాల్లో రోజురోజుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఫలితంగా కొన్ని ప్రాంతాలు రద్దీగా మారే అవకాశాలున్నాయని, వాటిని గుర్తిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా చోట్ల ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలోని అరకులోయ, యండపల్లివలస, అనంతగిరి, బొర్రా జంక్షన్, ఘాట్‌రోడ్డు, దుంబ్రిగు డ, చాపరాయి, అరకు సంతబయలు తదితర ప్రధాన ప్రాంతాల్లో పర్యాటకులకు, స్థానికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసు సిబ్బందితో పర్యవేక్షిస్తామన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలను నిలుపుదల చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

కుక్కలు, కోతుల స్వైరవిహారం

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరులో కుక్కలు కోతుల నివారణకు జెన్‌కో అధికారులు, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జెన్‌కో కాలనీ, మార్కెట్ వద్ద కోతులు, కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయని చెబుతున్నారు. దుకాణాల్లోనూ, ఇళ్లలోను చొరబడి కూరగాయలు, పండ్లు, వస్తువులను కోతులు తీసుకెళ్లిపోతున్నాయని, ఎప్పుడు దాడి చేస్తాయోనని వ్యాపారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయని, పాదచారులు, వాహనచోదకులపై దాడులు చేస్తున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతులు, కుక్కల బెడదతో సతమతమవుతున్నాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

56 మందికి వైద్య పరీక్షలు


కుమ్మరిపుట్టులో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో కిలగాడ వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు చేశారు. జ్వరాలతో బాధపడుతున్న 23 మందికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయరాదని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. వైద్య సిబ్బంది అశోక్, లలిత, పుష్ప, మల్లేశ్వరి, కృష్ణవేణి, సుశీల, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం


ప్రసంగిస్తున్న జెట్టి అజరయ్య

కూనవరం: మండలంలోని దూగుట్ట చర్చిలో గుడ్ సమరిటన్ ఈవాంజికల్ లూథరన్ చర్చి అధ్యక్షుడు రెవరండ్ డాక్టర్ కె.రాధా అబ్రహం ఆధ్వర్యంలో మంగళవారం బిషప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రెవరండ్ జెట్టి అజరయ్య మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఏజన్సీలో రెవెరెండ్ డాక్టర్ ఎస్.పాల్ రాజు అనేక చర్చిలను, టీఎఫ్‌టీ హాస్టల్స్, జూనియర్ కళాశాలలను పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలు స్థాపించి విద్యా, వైద్య, ఆధ్యాత్మిక రంగంలో అనేక సేవలు అందించారని కొనియాడారు. అనంతరం డాక్టర్ కెఅబ్రహం మాట్లాడుతూ డాక్టర్ పాల్‌రాజు ఆయన సతీమణి బిషప్ కటాక్షమ్మ మహిళా బిషప్‌గా నియమితులు కావడం ఆనందకరమన్నారు. ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మారేడుమిల్లి : పిల్లల్లో సకాలంలో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలు గుర్తించి వారి అభివృద్ధికి పునాది వేయాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలయ్య అన్నారు. నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై మంగవారం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వివాంగులను అందరితో సమానంగా చూడాలని, వారికి కావలసింది సానుభూతి కాదని, వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సహం అందించాలన్నారు. సాధారణ పిల్లలతో సమానంగా విద్యను ప్రభుత్వం వారికి అందిస్తుందని తెలిపారు. దివ్యాంగులకు అండగా నిలవాలన్నారు. భవిత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు చిన్నబాబు, జ్యోత్స్న, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ రైతులకు సూచనలు


సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ మేనేజర్ వెంకటేష్

హుకుంపేట: గిరిజన కాఫీ రైతులు దళారీ వ్యాపారుల చేతిలో మోసపోకుండా ఐటీడీఏ ఆధ్వర్యంలో జీసీసీ సంస్థ కొనుగోలు చేస్తుందని జీసీసీలో విక్రయించుకోవచ్చని జీసీసీ మేనేజర్ బుక్క వెంకటేష్ తెలిపారు. మండలంలోని బాకురులో గిరిజన రైతులకు కాఫీ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాఫీ పంటను మూడు, నాలుగు దశల్లో సేకరించిన తరువాత కాఫీ పార్చ్‌మెంట్, చెర్రి పంటను జీసీసీలోనే కొనుగోలు చేస్తామన్నారు. గిరిజన రైతులకు కాఫీ బోర్డ్ అందించే సబ్సిడీ రుణాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, కాఫీ కళ్లాలు, కాఫీ పల్పింగ్ మిషన్‌లు, టార్పాలిన్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో లీలావతి, కాఫీ బోర్డ్ అధికారి సుధీర్, సర్పంచ్‌లు బాకురు వెంకటరమణ, దూసురు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.